క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో కాపులకు సముచిత స్థానం


తోట రామకృష్ణ

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీలో కాపులకు సముచిత స్థానం, గౌరవం లభిస్తాయని రాష్ట్ర కాపు జేఏసీ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ అన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కురసాల కన్నబాబును వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోర్డినేటర్‌గా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పెద్దేవంలో మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో కాపులందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందనడానికి కన్నబాబు నిదర్శనమన్నారు. కాపు నేతలకు గుర్తింపు ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ గ్రామాల్లో ఇళ్ల స్థలాల సర్వే


పోచవరంలో సర్వే చేస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని పోచవరం, ప్రక్కిలంక గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేసి ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీబీ వెంకట రమణ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి అమ్మాజీ, డివిజనల్ పంచాయతీ అధికారి శాంతామణి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో అమ్మాజీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి స్థలాన్ని రోవర్, శాటిలైట్ ద్వారా సర్వే చేసి కొలతలు, ఇంటి సరిహద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ


చాగల్లులో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

చాగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. మండలంలోని చాగల్లు, ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం చాగల్లు, మార్కొండపాడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ పక్వాడ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్లు జి.శిరీష, పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యలో నాణ్యతే లక్ష్యం

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుల నాణ్యతను మెరుగుపర్చడమే పోషణ్ భీ.. పఢాయీ భీ కార్యక్రమ జ లక్ష్యమని గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. పోతవరం హైస్కూలులో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ రెండో రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నతనం నుంచే చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం వంటి నైపుణ్యాలు పెంపొందించాలని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాలను మెరుగుపరచి, పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని అన్నారు. సూపర్‌వైజర్లు కృష్ణవేణి, హారతి రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. నల్లజర్లలో కూడ రెండో రోజు శిక్షణ జరిగింది.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ప్రక్కిలంక సచివాలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, తాడిపూడి, తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో శుక్రవారం కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, పలు పాఠశాలలు, సొసైటీల్లో ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల్లో అధ్యాపకులను కలిసి పేరాబత్తులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కరిబండి గనిరాజు మాట్లాడుతూ కళాశాలకు వచ్చే రోడ్డు ఏళ్ల తరబడి వేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొర్రనాచు... కష్టాల ఉచ్చు

- శివారుకు అందని సాగునీరు
- వ్యర్థాలతో నిండిన పంట కాలువలు


ముక్కామల చానల్‌లో కొర్రనాచు


ఉసులుమర్రు వద్ద పెండ్యాల పంపింగ్ స్కీమ్ నుంచి వస్తున్న మురుగు

పెరవలి: పంట కాదు పెంట కాలువలయ్యాయి.. శివారుకు నీరందక ఇబ్బంది తెచ్చిపెడుతున్నాయి.. కాలువల్లో కొర్రనాచు పెరగడంతో కష్టాలు వచ్చిపడ్డాయి.. 15 ఏళ్ల కిందట ప్రధాన కాలువల ఆధునీకరణ జరిగినా చిన్న, పిల్ల కాలువలను పట్టించుకోలేదు. ఇవి ఆక్రమణలకు గురై కొన్ని, పూడుకుపోయి ఇంకొన్ని దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అంతంత మాత్రంగా వస్తున్న నీటిని చిన్న, పిల్ల కాలువల్లో పేరుకుపోయిన కొర్రనాచు అడ్డుకోవడంతో నీటి ప్రవాహం సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరవలి మండలంలో ప్రధానంగా నరసాపురం, కాకరపర్రు, బ్యాంక్ కెనాల్‌లు ఉన్నాయి. వీటి నుంచి విడిపోయిన చిన్న, పిల్ల కాలువలు 69 వరకూ ఉంటాయి. చిన్న, పిల్ల కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, కొర్ర నాచుతో దిగువ భూములకు నీరు అందడం లేదు. కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో శివారు భూముల రైతులకు సాగునీరు అందేటప్పటికి నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా ఆక్రమణలు కూడా ఎక్కువ కావడంతో కాలువలు ఎక్కడికక్కడ పూడుకుపోయాయి. పెరవలి, ముక్కామల, ఖండవల్లి, ఉసులుమర్రు, కాపవరం, అన్నవరప్పాడు గ్రామాల మధ్య నుంచి గరపకాలువ, వైర్ కాలువ, కాపవరం కాలువ, ఖండవల్లి చానల్, బ్యాంచ్ కెనాల్, పెండ్యాల పంపింగ్ స్కీమ్, తూర్పు విప్పర్రు వెస్ట్, ఈస్ట్ కాలువలు ఉన్నాయి.

సాగు ఎంతంటే..

ఈ కాలువలపై ఒక్క పెరవలి మండలంలోనే 37 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉన్నా, కేవలం 25 వేల ఎకరాలకు మాత్రమే సక్రమంగా నీరు అందుతుంది. మిగిలిన 12 వేల ఎకరాల్లో కొంత ఖరీఫ్ పంటకు అందినా రబీ పంటకు అందడం లేదని చెబుతున్నారు. రబీలో కాపవరం, ముక్కామల, ఖండవల్లి, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు రైతులు చుక్కనీరు రాక బోర్ల పైనే సాగు చేసుకోవాల్సి వస్తుంది. అధికారులు పట్టించుకోకపోయినా సాగునీటి కోసం కాలువలను తామే బాగు చేసుకుంటున్నామని, అయినా ఖరీఫ్ పంటకే తప్ప రబీ పంటకు నీరు అందదని చెబుతున్నారు. ప్రతి ఏడాది ఈ కాలువల ద్వారా సాగునీరు అందకపోయినా పంట వేసి నీటితీరువా మాత్రం కడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ కాలువల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కాలువలు గ్రామం మధ్య నుంచి ప్రవహించటంతో నివాసాల వారు ఎక్కడిక్కడ చెత్తా చెదారం వేయటంతో పూడుకు పోతున్నాయని అంటున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా..



చిన్న, పిల్ల కాలువల్లో కొర్రనాచు పేరుకుపోవడంతో నీరు దిగువకు రావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. రైతులమే స్వచ్ఛందంగా వ్యర్థాలు తీసుకుంటున్నాము. ఇప్పుడు ఎంత తొలగించినా నీరు రావటం లేదు. పూర్తి స్థాయిలో ఆధునీకరణ చేపట్టాలి.

–తాళా మంగారావు, కౌలురైతు, ఉసులుమర్రు

శివారుకు నీరందడం లేదు



కాలువలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కొర్రనాచు, తూడు, గుర్రపుడెక్క అల్లేసింది. శివారు భూములకు నీరు అందడం లేదు. నీటి తీరువా కట్టించుకోవటమే కానీ కాలువల గురించి పట్టించుకునే నాథుడే లేడు. నీరు అందక నానా పాట్లు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

–దిద్ల సంపతిరావు, రైతు, ఖండవల్లి

నివేదికలు సమర్పించాం



పెరవలి మండలంలో 14 చిన్న, పిల్ల కాలువల తవ్వకాలకు రూ.90 లక్షల అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. ఈ ఏడాది గతంలో నిధులు మంజూరైన మూడు కాలువల తవ్వకాలకు చర్యలు చేపడతాం.

–ఎస్.బాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి


పెరవలిలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

పెరవలి: అంగన్‌వాడీ కేంద్రాలను పోషక కేంద్రాలుగానే కాకుండా విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని.. అందుకే పోషణ్ భీ-పఢై భీ పథకం ప్రవేశపెట్టిందని సీడీపీఓ డి.శ్రీలక్ష్మి తెలిపారు. పెరవలి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ అంగన్‌వాడీ కేంద్రాలు పౌష్టికాహారంపైనే దృష్టి సారించి, అందుకు అనుగుణంగా పనిచేశాయన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంలో ప్రీస్కూల్‌తో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. పిల్లలకు 6 నుంచి 8 ఏళ్ల వయసులో నాణ్యమైన విద్య అర్థం అయ్యేలా అందిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మాతృ భాషలోనే విద్యాబోధన చేయాలని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు డిజిటల్ విధానంలో శిక్షణ ఇచ్చారు. సూపర్ వైజర్ వి.సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగానే కాకుండా విద్యను అందించే కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పోషన్ భీ- పఢాయి భీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంఈఓ కేవీ గణేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండోరోజు శిక్షణ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని మాట్లాడుతూ చిన్నారుల పోషణ, ఎదుగుదల విషయంలో అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిడదవోలు సెక్టర్ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య

ఉండ్రాజవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, ఎం.బాలసరస్వతి సూచించారు. ఉండ్రాజవరం, వేలివెన్ను అంగన్‌వాడీ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ- పఢాయి భీ కార్యక్రమంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. హెచ్‌ఎంలు మాణిక్యాలరావు, వీరాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు రంగనాయకమ్మ, ఎస్.నరసమ్మ, దుర్గాంబ పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి


కొవ్వూరులో అమర జవాన్ల ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు


కొవ్వూరు మెయిన్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు, అధికారులు

కొవ్వూరు: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది సైనికులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో అమరులైన జవాన్ల ఫ్లెక్సీ వద్ద విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశానికి సైనికులు చేస్తున్న సేవలను ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామ్మోహనరావు కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ

కొవ్వూరు: పుల్వామాలో ఉగ్ర దాడిలో సీఆర్‌పీఎఫ్ సైనికుల ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుంటూ కొవ్వూరు పట్టణంలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌రోడ్డు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేన్ అధ్యక్షుడు ప్రభాకరరావు మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయరన్నారు. ఉగ్ర దాడిలో అసువులు బాసిన కుటుంబాలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొందరికి మాత్రమే న్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు, ఏఎస్సై జీజీ ప్రకాష్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఇదేం దారిద్ర్యం!


రాళ్లు పైకి లేచిపోయి అధ్వానంగా మారిన మల్లవరం రహదారి

చాగల్లు: మల్లవరం నుంచి చాగల్లు రైల్వే గేటుకు వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. రోడ్డుపై రాళ్లు పైకి లేచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లవరం ప్రజలు మండల కేంద్రమైన చాగల్లుకు రావడానికి ఇదే దగ్గర మార్గం. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. మల్లవరం జెడ్పీ హైస్కూల్, వృద్ధాశ్రమాలకు ఈ రహదారి గుండానే వెళతారు. రోడ్డు ఛిద్రం కావడంతో పాఠశాలకు వెళ్లే మల్లవరం, గౌరిపల్లి గ్రామాల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికితోడు వర్షం కురిస్తే రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. గోతుల్లో నీరు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మల్లవరం, గౌరిపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారాలు


బాబుకు పటిక బెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం నలుగురు చిన్నారులను కుటుంబ సభ్యులు పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేసి, మొక్కు తీర్చుకున్నారు. పలువురు మహిళలు పాలు పొంగించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గోపాలపురం మండలం కొవ్వూరుపాడుకు చెందిన రావూరి మహేష్, స్వాతి దంపతుల కుమారుడు రేవంత్‌కు పటిక బెల్లంతో తులాభారం వేశారు. కరిచర్లగూడేనికి చెందిన నీలం వెంకన్నబాబు, శ్రీదివ్య దంపతుల కుమార్తె జైత్రి సుభిక్ష రమకు పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేశారు. తెలంగాణలోని భూపాల్‌పల్లికి చెందిన కుంకుల శ్రీగణేష్ కుమార్, మహాలక్ష్మి దంపతుల కుమార్తె హేమాన్యకు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడిని కలసిన ముద్రగడ


జక్కంపూడి రాజాతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మాజీ మంత్రి, పార్టీ నాయకులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు రాజమహేంద్రవరంలోని రాజా నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని ముద్రగడ అడిగి తెలుసుకున్నారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ, అతిచిన్న వయస్సులోనే రాజా, గణేష్ రాజకీయాల్లో రాణిస్తూ, రాజానగరం నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటూ, గ్రామీణ ప్రాంతాల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. తన తనయుడు ముద్రగడ గిరిబాబును ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా నియమించారని నాయకులకు పరిచయం చేశారు. ముద్రగడ గిరిబాబును జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఆశీర్వదించారు. తండ్రి పద్మనాభం మాదిరిగానే గిరిబాబు కూడా రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు తోట రామకృష్ణ, గౌతు స్వామి, నందెపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దళిత విద్యార్థి చేతులు నరకడం దారుణం


విలేకరులతో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: తమిళనాడులోని ఓ కాలేజీలో డిగ్రీ దళిత విద్యార్థి రెండు చేతులు నరకడం అమానుషానికి పరాకాష్ట అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, బుల్లెట్ నడిపితే అంత వివక్ష చూపాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఇంకా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాన్ని నిందించకపోతే, సమాజంలో జరుగుతున్న పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. సుప్రీం కోర్టు పక్షపాత దృష్టితో ఎస్సీ చట్టాల్ని నీరు గారుస్తోందని ఆరోపించారు. అట్రాసిటీ యాక్ట్ కేసుకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. చుండూరులో ఊచకోత జరిగితే నిందితులని నిర్దోషులుగా విడుదల చేశారని, ఇప్పటికీ ముద్దాయిలను పట్టుకోకపోవడం విచారకరమన్నారు. ఇకనైనా సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొచ్చి, దళితులపై దాడులను ఆపి, వారిని కాపాడాలని కోరారు.

20 నుంచి ఉద్భవ్-2025

కంబాలచెరువు: రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఉద్భవ్-2025 పేరిట జాతీయ స్థాయి యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. విద్యార్థులలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో వివిధ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

సమిశ్రగూడెంలో చోరీ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం మసీదు ఎదురుగా ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. లియాఖత్ అలీ, అతని భార్య గురువారం రాత్రి ఇంట్లోని వేరే గదిలో నిద్రపోయారు. ఆరుబయట గేటుకు తాళం వేయకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని కాసు బంగారం, వెండి పట్టీలతో పాటు రూ.3 వేల నగదు అపహరించారు. బాధితుడు లియాఖత్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని ఎస్సై కె.వీరబాబు పరిశీలించారు.

రేషన్ బియ్యానికి వేలం


రేషన్ బియ్యానికి వేలం నిర్వహిస్తున్న అధికారులు

దేవరపల్లి: వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న 16 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యానికి జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు దేవరపల్లిలోని వెంకటేశ్వర రైస్ మిల్లులో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. నల్లజర్లకు చెందిన శ్రీ వినాయక ట్రేడర్స్ యజమాని కిలో రూ.25 చొప్పున పాడుకున్నారని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఎం.నాగాంజనేయులు, ఏజీపీఓ రంగప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ డి.సురేష్‌బాబు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎం.అనిల్ కుమార్, పలువురు బియ్యం వ్యాపారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ


చక్రధర్

నిడదవోలు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో స్థానిక ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థి పీఎస్ఎస్‌డీ చక్రధర్ 99.06 శాతం మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి చక్రధర్‌ను, తన తల్లిదండ్రులు భూషణరావు, శాంతిలను అభినందించారు. సామాన్య విద్యార్థులతో అసమాన్య విజయాలు సాధిస్తున్న ఏకైక సంస్థ ఎస్ఎఫ్ఎస్ అని మరోసారి రుజువైందన్నారు.

విజేతలకు ఎంఈఓ అభినందన


విజేతలను అభినందిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

నల్లజర్ల: విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో దూబచర్ల సంఘమిత్రా స్కూలు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ప్రతిభ చూపిన యడ్లపల్లి మౌని (2వ తరగతి), తాళ్ళ సుశాంత్(6వ తరగతి)లను ఎంఈఓ వై.సత్యనారాయణ శుక్రవారం తన కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఏర్పాటు

కడియం: కొత్త బీజేపీ కడియం మండల కమిటీని పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ శుక్రవారం ఇక్కడ ప్రకటించారు. అధ్యక్షుడిగా బొరుసు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా దూడల సత్తిబాబు, గుత్తుల నాగలక్ష్మి, కె.శ్రీనివాస్, సుంకర రాజబాబు, నాగేశ్వరరావు, కార్యదర్శిగా పి.వేంకటేశ్వరరావు, కొత్తపల్లి శివ, టి.భవానీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దాసరి ముత్యం, లోవరాజు, కోశాధికారిగా బచ్చు బలరాంను ఎంపిక చేశారు.

ధవళేశ్వరం: రాజమండ్రి రూరల్ బీజేపీ మూడో మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వర్దినిడి సూర్యనాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరారావు, హరిదాసు శ్రీలక్ష్మి, అంబాల నాగరాజు, గుత్తుల జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా వంకాదర కుబేరరావు, రాపేటి గణపతి, కోశాధికారిగా గండేపల్లి వెంకటలక్ష్మి, కార్యదర్శులుగా తలాటం సూర్యప్రకాష్‌రావు, భవాని, నాగేశ్వరరావు, వేమగిరి గనిరాజు, జగన్నాథరావు ఎన్నికయ్యారు.

దోమల నివారణ చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట రామకృష్ణనగర్ దోమలకు నిలయంగా మారిందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.